క్లుప్తంగా

కొత్త పింఛన్ల పంపిణీ

యాదమరి: మండలంలోని బుడితిరెడ్డిపల్లెలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆదివారం సర్పంచ్ వాసు రెడ్డి అందించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో అర్హులైన 13 మందికి నూతన పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. లబ్ధిదారులకు వారి ఇంటి వద్దకు వెళ్లి ఆదివారం వలంటీర్‌తో కలసి రూ.3వేలు అందించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తోందని, ఇలాంటి పాలన కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు.

శిలాఫలకం ధ్వంసం



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

పూతలపట్టు: మండలంలోని ఎగువపాలకూరులో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉన్న శిలాఫలకాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారు. ఈనెల 18న ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు శనివారం విగ్రహం వద్దనున్న శిలాఫలకానికి మరమ్మతులు చేయించారు. ఈ క్రమంలో రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు శిలాఫలకాన్ని రాయితో పగులగొట్టారు. ఉదయం సమాచారం అందుకున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. టీడీపీ నాయకులు కొందరు అనుమానితుల పేర్లు తెలిపి చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి జబ్బులున్న రోగులకు డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించి చెన్నై శంకర్‌నేత్రాలయ ఆస్పత్రికి తరలించి ఉచితంగా నిర్వహిస్తామన్నారు.

తిరుపతి వెళ్లి పింఛన్ల పంపిణీ



పింఛను అందజేస్తున్న వలంటీర్ సురేష్

తవణంపల్లె: మండలంలోని దిగువ మోదలపల్లె పంచాయతీకి చెందిన 10 మంది సామాజిక పింఛనుదారులు తిరుపతిలోని రమాదేవి ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న టి.పుత్తూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ధనుంజయ, దిగువ మోదలపల్లె వలంటీర్ ఎన్.సురేష్ ఆదివారం తిరుపతికి వెళ్లి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున పింఛను అందజేశారు.

నేడు కార్పొరేషన్ కార్యాలయంలో స్పందన

చిత్తూరు అర్బన్: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం స్పందన నిర్వహించనున్నట్లు కమిషనర్ జె.అరుణ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్పందన ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను ఫిర్యాదుల రూపంలో అందించాలని సూచించారు. అలాగే నగరంలోని 50 డివిజన్లలోని వార్డు సచివాలయ కార్యాలయాల్లో సాయంత్రం 3 నుంచి 5 గంటల మధ్యలో స్పందన జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఇంటి నుంచే కార్పొరేషన్ కాల్ సెంటర్ నంబర్ 08572232745, వాట్సప్, 98499 07885కు సమస్యలు తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో..

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు స్పందన జరుగుతుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిత్తూరు అర్బన్: చిత్తూర ఇరువారంలో ఆదివారం పేకాట స్థావరాలపై టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈదాడుల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారి నుంచి రూ.4,700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు సీఐ ఉలసయ్య పేర్కొన్నారు.

బ్రెయిన్ సర్జరీ విజయవంతం

చిత్తూరు రూరల్: తమ ఆస్పత్రిలో బ్రెయిన్ సర్జరీని విజయవంతం చేసినట్లు చిత్తూరు నగరంలోని ఏకేఎస్ అమ్మ ఆస్పత్రి డాక్టర్ కల్యాణ్ బాబు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైద్య బృందం సహకారంతో బ్రెయిన్ సర్జరీ విజయ వంతమైందన్నారు. సర్జరీ చేయించుకున్న వేలూరు జిల్లాకు చెందిన రోగి జలధర్ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడ ఉందన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో కోలుకుంటారని తెలిపారు. సమావేశంలో డాక్టరు రమేష్‌బాబు, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో గుడిబడి సేవలు



అంజూరు శ్రీనివాసులుకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ సూపరింటెండెంట్ వాసు



ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న గుడిబడి బృందం సభ్యులు

కాణిపాకం(యాదమరి): తిరుపతికి చెందిన గుడిబడి బృందం సభ్యులు ఆదివారం స్వచ్ఛందంగా కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. వారిని ఆలయ అధికారులు అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈవో వెంకటేశు, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని దర్శించుకున్న శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ వాసు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులతో ఆశీర్వచనం అందించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

18న హుండీ కానుకల లెక్కింపు

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఆస్థాన మండపంలో ఆరోజు ఉదయం 7 గంటల నుంచి నిర్వహించే కానుకల లెక్కింపునకు ఆలయ అధికారులు, సిబ్బంది హాజరు కావాలని కోరారు.

25న ధర్మకర్తల మండలి సమావేశం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ ధర్మకర్తల మండలి సమావేశం ఈనెల 25న నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. దేవస్థానం సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి నిత్యాన్నదానానికి ఆదివారం కరీంనగర్‌కు చెందిన సత్యనారాయణ రూ.లక్ష విరాళం అందజేశారు. ఆయనకు అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్‌స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

ప్రజారోగ్యం దృష్ట్యా విధులకు రండి



మాట్లాడుతున్న కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: నగర ప్రజల ఆరోగ్యం దృష్ట్యా మున్సిపల్ అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరుకావాలని నగర పాలక కమిషనర్ జె.అరుణ కోరారు. ఆదివారం నగరపాలక కార్యాలయంలో మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగం కార్మికుల యూనియన్ నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ సమ్మె నేపథ్యంలో క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య లోపం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజల ఆరోగ్యం దష్ట్యా పారిశుద్ధ్య కార్మికులు విధులకు హాజరుకావాలని కోరారు. కమిషనర్ పిలుపునకు కార్మిక సంఘాల నాయకులు సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నయ్య, అవుట్ సోర్సింగ్ ప్రజారోగ్య, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

పైప్‌లైన్, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి



వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ అశోక్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని ఇరువారం స్లం యారియాలో కమ్యూనిటీ హాలు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉందని 20వ వార్డు కార్పొరేటర్ కె.అశోక్ ఆదివారం ఐఓసీఎల్ సౌత్ ఇండియన్ డైరెక్టర్, ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ శైలేష్ తివారీకి వినతి పత్రం అందచేశారు, చిత్తూరు నగరంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి శైలేష్ తివారీ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఇరువారం ప్రజలు డ్రైనేజి పైపులైన్, కమ్యూనిటీ హాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్పందించిన శైలేష్ తివారీ ప్రణాళికలు ఇవ్వాలని చిత్తూరు నగర పాలక సంస్థ అధికారులకు తెలిపారు. నగరపాలక అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిజమైన జననేత సీఎం జగన్



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

- పింఛన్ రూ.3 వేల పెంపుతో ఆనందం
- మండలంలో 6,534 మందికి పింఛన్
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



హాజరైన లబ్ధిదారులు

శ్రీరంగరాజపురం: ప్రతి పేదవాడి ఇంటికి పెద్ద కొడుకులా నిలుస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన జననేత అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ పింఛన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పేదవర్గాల వారిని ఆర్థికంగా, సామాజికంగా న్యాయం చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఉద్దేశమన్నారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు గుమ్మం వద్దకే వలంటీర్లు అందిస్తున్నారన్నారు. ప్రతినెలా 1న ఉదయం 6 గంటల కల్లా తలుపు తట్టి గుడ్ మార్నింగ్ చెప్పి అవ్వాతాతలకు, అక్కాచెల్లెమ్మలకు వలంటీర్లు పింఛన్ అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి విద్యకు పెద్దపీట వేశారని తెలిపారు. సంక్షేమ పథకాల ప్రదాత జగనన్నను 2024లో ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, ఎంపీటీసీ సభ్యుడు శివయ్య, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, మండల కన్వీనర్ మణి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, తహసీల్దార్ బెన్నూరాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, నేతలు జనార్దన్, కుప్పయ్య, కాలప్ప, విజయబాబు, సురేష్‌రాజు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

అంబేడ్కర్ కమిటీ నూతన కార్యవర్గం



నవీన్‌కుమార్, శ్రావణ్‌కుమార్

బంగారుపాళెం: స్థానిక దళితవాడ రాములవారి గుడి వద్ద ఆదివారం అంబేడ్కర్ కమిటీ సభ్యుల సమావేశాన్ని గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దేవయ్య, మండల అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా అజయ్‌కుమార్, కార్యదర్శిగా శ్రావణ్‌కుమార్, ఉప కార్యదర్శిగా రెడ్డెప్ప, కోశాధికారిగా ఢిల్లీకుమార్, సలహాదారులుగా గోవిందయ్య, ధనంజయ, పార్థసారథిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భక్తులకు మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దర్శనార్థం వచ్చే భక్తులు, యాత్రికులకు మెరుగైన వసతులు కల్పించడమే తన ధ్యేయమని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి తెలిపారు. ఆదివారం భక్తులకు ఉచిత ప్రసాదం వితరణ చేశారు. అమ్మవారి దర్శనం, వసతులు ఎలా ఉన్నాయో భక్తుల అభిప్రాయం తెలుసుకున్నారు. బోయకొండ గంగాపురంలో పుంగనూరు శ్రీవెంకట గణపతి బోర్‌వెల్స్ నిర్వాహకులు గురుప్రసాద్ కుటుంబ సభ్యులు ఆదివారం చైర్మన్‌తో కలిసి బోరు డ్రిల్లింగ్‌కు పనులు ప్రారంభించారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయంను అందజేస్తున్న సంఘం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఐరాల మండలం పి.ఎర్రేపల్లెకు చెందిన మెకానిక్ చేతన్‌బాబు కుటుంబానికి చిత్తూరు టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. ఆదివారం చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో ఈ మొత్తాన్ని అందజేశారు. చేతన్‌బాబు(42) డిసెంబర్ 20న విద్యుత్‌ఘాతంతో మృతి చెందారు. సంఘం, మెకానిక్, దాతల సాయంతో రూ.40వేలను సేకరించి ఆయన సతీమణి జానకికి అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్, మురగ, ఉపాధ్యక్షుడు మున్నా అందజేశారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి దేవా, కోశాధికారి షణ్ముగంరెడ్డి, కమిటీ సభ్యులు బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆరోగ్య పథం



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డీపీఎం

- రసాయనేతర పంటల గురించి ప్రజలు ఆలోచిస్తున్నారు
- రైతులు ఆరోగ్యం కోసమైనా ప్రకృతి పద్ధతిలో పంటల సాగు చేయాలి
- కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడమే కేంద్రం లక్ష్యం
- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు

నగరి : ప్రకృతి వ్యవసాయం ఆరోగ్య పథమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని వెలుగు సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనేతర పంటల లాభాలను అధిక శాతం ప్రజలు తెలుసుకుంటున్నారని ధర ఎక్కువైనా వెచ్చించి కొనడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఆర్గానిక్ పంటల కోసం సుదూర ప్రాంతాలకు సైతం వెళ్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యకరమైన పంటలపై అవగాహన పెరిగిందని, దీంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతూ వస్తోందన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించే మార్గంలో రైతులు ప్రయాణించాలన్నదే తమ ధ్యేయమన్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా రాష్ట్రప్రభుత్వం రైతు సాధికార సంస్థ అంటూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. కేంద్రప్రభుత్వం కూడా కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించాలన్న ప్రయత్నంలో ఉందన్నారు. తొలుత రైతులు వారి ఆరోగ్యం కోసం వారికి ఉన్న పొలంలో కొంతమేర ప్రకృతి వ్యవసాయంలో సాగు చేయాలన్నారు. అప్పుడు వ్యత్యాసం వారే గమనిస్తారన్నారు. ఖర్చు తక్కువ అవుతుందని ఆరోగ్యమైన పంటను చూస్తారన్నారు. రసాయనాలు దిగుబడి ఎక్కువగా ఇచ్చినా ఖర్చు ఎక్కువ అవుతుందన్నారు. అది అనారోగ్యం పండించినట్లే అన్నారు. జిల్లాలో ఉన్న పంచాయతీలలో దాదాపు మూడింట ఒక భాగంలోనే సాగు చేస్తున్నట్లు తెలిపారు. మెలమెల్లగా ప్రకృతి వ్యవసాయ సాగువిస్తీర్ణం పెంచాలన్నారు. పండించిన కూరగాయల విక్రయానికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించే ఏర్పాటు చేస్తున్నామన్నారు.

సేవాభావంతో పని చేయండి

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సేవాభావంతో పని చేయాలని రైతులను ఈ వ్యవసాయం వైపునకు మళ్లించాలని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ఎదురయ్యే సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరగా ప్రధానంగా వ్యవసాయంలో కూలీల కొరత ఉందని ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయ రంగంలో ప్రవేశపెడితే పలువురికి లాభం చేకూరుతుందని, అలాగే పంట విక్రయ కేంద్రాన్ని పట్టణంలో త్వరగా ఏర్పాటు చేయాలని రైతులు సూచించారు. రైతుల కోరికను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించి కేంద్రప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ గురుప్రసాద్, మహేష్, నాంచారమ్మ, మాస్టర్ ట్రైనర్లు ప్రతాప్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దన్ను.. వైఎస్సార్ రైతు భరోసా

- నియోజకవర్గంలో 42,388 మందికి లబ్ధి
- రైతుల ఖాతాలోకి రూ.59.30 కోట్ల జమ
- గత ప్రభుత్వంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందక రైతుల అవస్థలు



తవణంపల్లెలో రైతు భరోసాతో సాగులో ఉన్న వరి పంట



క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలిస్తున్న తవణంపల్లె ఏవో జి.ప్రవీణ్

తవణంపల్లె: గత టీడీపీ హయాంలో పంటల సాగుకు పెట్టుబడి కోసం రైతులు అధిక వడ్డీలకు అప్పులు తీసుకునేవారు. సరైన దిగుబడి లేక అప్పులు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కనీసం ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందేదికాదు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా పథకాన్ని అమలుచేసి రైతులకు వెన్నుదన్నుగా నిలిచారు. దీనికితోడు నాలుగున్నరేళ్లలో పుష్కలంగా వర్షాలు కురుస్తుండడంతో సెంటు భూమి కూడా బీడు లేకుండాపోయింది. పూతలపట్టు నియోజకవర్గంలో 42,388 మంది రైతులు ఉన్నారు. 84,942 ఎకరాల విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. ప్రభుత్వం వైఎస్సార్ రైతు భరోసా కింద రైతులకు రూ.59.30 కోట్లను ఖాతాల్లో జమ చేసింది. చంద్రబాబునాయుడు పాలనలో ఎక్కడ చూసినా బీడు భూములు దర్శనమిచ్చేవి. ప్రస్తుతం నియోజకవర్గంలో పంట పొలాలు పంటలతో కళకళలాడుతున్నాయి. పంటల సాగుకోసం అధిక వడ్డీలకు అప్పు చేసే అవసరం రావడం లేదని రైతులు చెబుతున్నారు. అంతేగాక పంటలకు గిట్టుబాటు ధర లభిస్తుండడం సంతోషంగా ఉందని పేర్కొంటున్నారు. పంటలు నష్టపోతే సకాలంలో నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందజేస్తున్నారని అంటున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోనే ఎరువులు, పురుగు మందులు అందజేస్తుండడంతోపాటు పంట సాగులో మెళకువలు తెలియజేస్తున్నారని వెల్లడిస్తున్నారు.

రైతుల పక్షపాతి సీఎం జగన్




సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి రైతు పక్షపాతి. రైతులకు సౌకర్యంగా ఆర్‌బీకేలను ఏర్పాటు చేశారు. పంటల సాగుకు రైతు భరోసా అందించి ఆదుకుంటున్నారు. సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ కూడా ఇస్తున్నారు. –రామచంద్రారెడ్డి, రైతు, మల్లకుంట

రైతు రాజుగా మారాడు



పంటలు సాగుకు రైతు భరోసా డబ్బులు సకాలంలో బ్యాంకు ఖాతాలోకి వస్తున్నాయి. దీంతో పెట్టుబడి కోసం ఎదురు చూడకుండా పంటలు సాగు చేసుకుంటున్నాం. గిట్టుబాటు ధర రావడంతో రైతు రాజుగా మారాడు. –రంగనాథశెట్టి, రైతు, చిన్నవెంకటంపల్లె

రైతులకు భరోసా ఇచ్చారు



పంటల సాగుకు పెట్టుబడి కోసం గతంలో అధిక వడ్డీలకు అప్పు తెచ్చుకునేవారం. ఇప్పుడు సీఎం జగన్ రైతు భరోసా కింద డబ్బులు ఇస్తున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో పంటల సాగులో నష్టాలు రావడం లేదు. –సి.దిలీప్, రైతు, మాధవరం

సీఎంకు రుణపడి ఉంటాం



అనేక సంక్షేమ పథకాలతో రైతుల పక్షపాతిగా నిలిచిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం. ఆర్‌బీకేల ద్వారా రైతులకు గ్రామంలోనే విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నారు. సలహాలు, సూచనలు ఇస్తున్నారు. రైతులకు ప్రభుత్వం చేస్తున్న సేవలు భేష్. –వేణుగోపాల్‌రెడ్డి, రైతు, బంగారుపాళ్యం

రైతుల గురించి ఆలోచించే నాయకుడు జగన్



గతంలో రైతుల గురించి పట్టించుకున్న నాథుడు లేడు. ప్రస్తుతం సీఎం జగన్ రైతుల కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నారు. పంటల సాగుకు అనుకూలంగా రైతు భరోసా అందించి ఆదుకుంటున్నారు. ఆయనను మరోసారి సీఎంగా చేసుకోవాలి. –వసంతరెడ్డి, టి.పుత్తూరు